"ఎందుకు నా కోసం వేచి ఉన్నావు?"

"నేనీ దేశపు రాజుని. మీరేదైనా నాలుగు మంచి మాటలు చెప్తే విని ఆచరిద్దామని వేచి ఉన్నాను." జవాబు చెప్పాడు రాజు.

యోగి కొన్ని క్షణాలు ఆలోచించి చెప్పాడు.

"ఏ రాజు చేతులైనా సరే కురచగా ఉండాలి. అదే సమయంలో విశాలంగా కూడా ఉండాలి."

"మీ మాటల వెనక ఉన్న బోధ నాకు అర్థం కాలేదు స్వామి." అణకువగా చెప్పాడు రాజు.

"ప్రజల నించి పన్నులు వసూలు చేసేప్పుడు రాజు చేతులు కురచగాను, వారి శ్రేయస్సు కోసం ఖర్చు చేస్తున్నప్పుడు విశాలంగాను ఉండాలి."

తను అందుకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తూండబట్టే ఆ యోగి తనకా ఉపదేశం చేసాడని గుర్తించిన రాజు తన తప్పుని సరిదిద్దుకుని అప్పటి నించి ప్రజలని పన్నుల భారంతో పీడించక వారి శ్రేయస్సుకై కృషి చేసి సత్ప్రవర్తనతో మంచి పేరు తెచ్చుకున్నాడు. మనం చేసే ప్రతీ పనిలో దయని తప్పక కలిపి చేయాలి.

## 111. కాలం విలువ

బాంబే నించి వచ్చిన ఓ ఆధ్యాత్మికవేత్తని రైల్వే స్టేషన్ నించి పికప్ చేసుకున్న భక్తుడైన ఓ వ్యాపారి, ఆయన్ని సరాసరి ప్రసంగ స్థలానికి కారులో తీసుకు వెళ్తున్నాడు. దారిలో అనేక చోట్ల రెడ్ లైట్ల దగ్గర కారుని ఆపాల్సివచ్చింది.

"నగరంలో ట్రాఫిక్ లైట్ల దగ్గర రోజూ చాలా సమయం వృధా అవుతోంది." వాపోతూ చెప్పాడా వ్యాపారి.

"బాంబేలో నేను ఇంటి నించి మా సెంటర్‌కి వెళ్ళడానికి ఇంతకన్నా ఎక్కువ ట్రాఫిక్ లైట్లు ఉన్నాయి. కాని నా సమయం మాత్రం వృధా కాదు." చెప్పాడు ఆ ఆధ్యాత్మికవేత్త.

"ఆ సమయంలో ఏం చేస్తారు? ఏదైనా ఆధ్యాత్మిక పుస్తకం చదువుతారా? లేక ఆధ్యాత్మిక కీర్తనలు వింటారా?"

"ఊహూ. అనారోగ్యంగా ఉన్న అనేకమందికి ఆరోగ్యం చేకూరాలని దేవుడ్ని ప్రార్ధిస్తాను. ఇలా నిత్యం నా జాబితాలోని అందరి కోసం ట్రాఫిక్ లైట్ల వల్ల ప్రార్ధనలని చేయగలుగుతున్నాను." చెప్పాడు ఆయన.

మన సమయం వృధా అవడం లేదా అవకపోవడం అన్నది మన చేతుల్లో ఉంది తప్ప పరిస్థితుల్లో కాని, ఇతరుల చేతుల్లో కాని ఉండదు.

## 112. గుడ్డి బిచ్చగాడు

ఓ సినిమా హాలు బయట ఓ బిచ్చగాడు రోడ్డు పక్కన చిరిగిన దుప్పటిని పరచుకుని, దాని మీద కూర్చుని అడుక్కుంటున్నాడు. అతను అంధుడు. కొందరు విసిరిన నాణాలు అతని దగ్గరకి చేరకుండా పక్కకి వెళ్ళినా అతను వాటిని తీసుకోలేదు.

దారిన వెళ్ళే ఒకతను ఇది చూసి ఆ నాణాలన్నిటిని ఏరి ఆ గుడ్డివాడి దుప్పటి మీద వేసాడు.

"టైమెంతైంది బాబు?" అలికిడి విని ప్రశ్నించాడు బిచ్చగాడు.

"రెండుం పావు."

చెప్పి తర్వాత అతను తన దారిన తను వెళ్ళిపోయాడు. రెండు నిముషాలు ఆగి, ఆ గుడ్డివాడు లేచి నాణాలని జేబులో వేసుకుని, దుప్పటిని మడిచి భుజాన వేసుకుని చేతి కర్రని తాటిస్తూ ఎదురుగా వున్న సినిమా హాల్లోకి వెళ్ళాడు. టిక్కెట్టు కొనుక్కుని వారం క్రితం విడుదలైన ఆ సినిమాకి వెళ్ళాడు.

ఇంట్రవెల్‌లో తన పక్కన కూర్చుని ఉన్న, తను సహాయం చేసిన ఆ అంధుడ్ని చూసి అతను ఆశ్చర్యంగా అడిగాడు.

"నీకు కళ్ళు కనపడతాయా?"

"ఊహూ."

"మరి సినిమాకి ఎందుకు వచ్చావు?"

"విందామని." జవాబు చెప్పాడు ఆ గుడ్డి బిచ్చగాడు.

వాంఛ గుడ్డిది.